అభివృద్ధి పనులకు కేంద్రమంత్రి భూమి పూజ

విద్యానగర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

విద్యానగర్, ఏప్రిల్ 20 : నగరంలోని 57వ డివిజన్ విద్యానగర్‌లో ఆదివారం పలు అభివృద్ధి పనులకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, మాజీ కార్పొరేటర్లు బండ సుమా రమణారెడ్డి, బీజేపీ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

దళారులకు ధాన్యం విక్రయించవద్దు

శ్రీనివాస్‌నగర్-జగ్గయ్యపల్లి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్/రూరల్, ఏప్రిల్ 20: రైతులు తమ ధాన్యాన్ని మధ్య దళారులకు విక్రయించి నష్టపోవద్దని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. ఆదివారం మానకొండూర్ మండలం శ్రీనివాస్‌నగర్-జగ్గయ్యపల్లి గ్రామాల రైతుల కోసం హాకా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి మద్దతు ధర పొందాలని కోరారు. రైతులను నష్టపరిచేలా ధాన్యం తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కేంద్రం నిర్వాహకులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, హాకా మేనేజర్ కృష్ణయ్య, సూపర్‌వైజర్ లక్ష్మణ్, ఏఎంసీ పాలకవర్గ సభ్యులు, వివిధ గ్రామాల నాయకులు, రైతులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని లలితాపూర్‌లో యాదవ సంఘం అధ్యక్షుడు నల్లంగి ఐలయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీమల్లికార్జున స్వామి మల్లన్న పట్నాలకు ఎమ్మెల్యే హాజరై, ప్రత్యేక పూజలు చేశారు.

ప్రైవేటు పీఈటీల సంఘం నూతన కార్యవర్గం

నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

కొత్తపల్లి, ఏప్రిల్ 20: జిల్లా ప్రైవేటు వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక జ్యోతినగర్‌లోని జీనీయస్ చెస్ అకాడమీలో జరిగిన ప్రైవేటు వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికైంది. గతంలో ప్రైవేటు పీఈటీల సంఘం ఉండగా కరోనా అనంతరం ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించలేకపోవడంతో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా పూర్వ ఉమ్మడి జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం కోశాధికారి సిలివేరి మహేందర్, కొరిమి సంతోష్ కుమార్, బొల్లి మహేశ్ వ్యవహరించారు. కాగా, నూతన సంఘం అధ్యక్షుడిగా బత్తిని శ్రీధర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా గౌతంరెడ్డి, కోశాధికారిగా కంకటి అనూప్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ, జిల్లాలోని ప్రైవేటు వ్యాయామ విద్య ఉపాధ్యాయులందరిని ఒక్క తాటిపైకి తెచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని పలువురు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా సుమారు 120 మంది సీనియర్, జూనియర్ ప్రైవేటు వ్యాయామ విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల విద్యార్థినుల జీవ వైవిధ్య క్షేత్ర పర్యటన

బొటానికల్ గార్డెన్ పర్యటనలో విద్యార్థినులు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 20 : ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు జీవశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో మహారాష్ట్ర బల్లార్‌పూర్‌లోని అటల్ బిహారీ వాజ్‌పేయి బొటానికల్ గార్డెన్‌ను ఆదివారం సందర్శించారు. ఇందులో భాగంగా, వివిధ రకాల పూల మొక్కలు, ఎగ్జిబిషన్ సెంటర్, మ్యాథమెటిక్స్ పార్క్, తదితర పార్కులు పరిశీలించారు. ప్రత్యక్ష అనుభవాల ద్వారా విద్యార్థుల్లో విషయ అవగాహన పెరుగుతుందని అధ్యాపకులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు నారాయణ, డాక్టర్ సుజాత, డాక్టర్ దేవేందర్, డాక్టర్ తిరుపతి, రవళీ కృష్ణ, రేఖా రాణి, రమ్య, ప్రియాంక, డిగ్రీ, పీజీ విద్యార్థినులు పాల్గొన్నారు.

బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, ఏప్రిల్ 20 : 2025-26వ సంవత్సరానికి ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డు-2025 కోసం అర్హులైన బాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు, జిల్లా సంక్షేమాధికారి సబితకుమారి తెలిపారు. మహిళా,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ప్రతిభ చాటే 5నుంచి 18 ఏళ్లలోపు బాలబాలికలకు ఏటా బాలపురస్కార్ అవార్డులు అందజేస్తుండగా, ఆవిష్కరణలు, సృజనాత్మకత, మంచి అభ్యాస వాతావరణం, సాంస్కృతికం, కళలు, సాహసం, క్రీడలు, సామాజిక సేవ, శాస్త్ర, సాంకేతిక, ఇతర రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన బాలలు ఈ ఏడాది జూలై 31లోగా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. http;\\awards.gov.in వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులు అప్‌లోడ్ చేయాలని సూచించారు. అలాగే జిల్లా పరిషత్‌లోని రెండో అంతస్తులో గల బాలరక్షా భవన్ కార్యాలయంలో నేరుగా లేదా 7396424387 అనే నంబర్‌లో సంప్రదించాలని ఒక ప్రకటనలో తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 20: చెల్పూర్ గ్రామ ఉన్నత పాఠశాలకు చెందిన 1993-94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం అదే పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని అనురాధ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. పూర్వ విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రయ్య, మల్లారెడ్డి, రాజేంద్రప్రసాద్, జనార్దన్ రెడ్డి, కృష్ణప్రియ, సీతారామయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

హరితం ఆహుతి

- మోడువారుతున్న అవెన్యూ ప్లాంటేషన్లు
- జిల్లాలో తగ్గుతున్న అటవీ శాతం
- పెరుగుతున్న వాయు కాలుష్యం
- పట్టించుకోని యంత్రాంగం
- చోద్యం చూస్తున్న పాలక నేతలు

హరితహారంలో భాగంగా ఏర్పాటు చేసిన అవెన్యూ ప్లాంటేషన్లు అగ్నికి ఆహుతవుతున్నాయి. పర్యావరణ పరిరక్షణతో పాటు, ఆరోగ్య తెలంగాణే ధ్యేయంగా కోట్లాది రూపాయల ఖర్చుతో పెంచిన మొక్కలు ఎదుగకముందే బుగ్గిపాలవుతున్నాయి. ఇన్నాళ్లూ నిత్యం సంరక్షణతో నడి ఎండల్లో సైతం ఆకుపచ్చ రంగును సంతరించుకుని ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కనీస పర్యవేక్షణ కరువవడం, అధికార నేతలు చోద్యం చూస్తుండడంతోనే ఈ దుస్థితి దాపురించిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కలెక్టరేట్, ఏప్రిల్ 20: సీమాంధ్రుల పాలనలో పాలకుల విచ్చలవిడి విధానంతో జిల్లాలో అటవీ సంపద తగ్గింది. కాలుష్య కారకాలు పెరిగి, పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగింది. ముఖ్యంగా వాయు కాలుష్యం వెదజల్లడంలో దేశ రాజధాని ఢిల్లీతో పోటీ పడిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి. స్వరాష్ట్ర కల సాకారమైన అనంతరం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కాలుష్యాన్ని అరికట్టి ఆరోగ్య తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ప్రకటించి, అమలుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పాలనాపగ్గాలు చేపట్టిన మొదటి ఏడాదిలోనే హరితహారం కార్యక్రమాన్ని చేపట్టి, తెలంగాణ పోరాట స్ఫూర్తితో హరిత ఉద్యమానికి నాంది పలికారు. ప్రతి ఏటా జూలై నుంచి అక్టోబర్ వరకు ప్రజలు, అధికారులకు లక్ష్యం విధించి మొక్కలు నాటేలా చర్యలు తీసుకున్నారు. ఇక్కడ, అక్కడా అని కాకుండా ప్రభుత్వ, పరంపోగు, బంచరాయి, గుట్టలు, రోడ్లు, ఇళ్ల పక్కన, వ్యవసాయ భూముల్లోని పొలం గట్లపై కూడా మొక్కలు నాటించారు. వాటి సంరక్షణ బాధ్యతలు గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖలతో పాటు గ్రామాల్లోని పంచాయతీలు, రైతులకు అప్పగించారు. సంరక్షణపై నిర్లక్ష్యం వహించే యంత్రాంగం, ప్రజాప్రతినిధులపై కూడా కఠిన చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులను పురమాయించారు. వరుసగా తొమ్మిదేళ్లపాటు పట్టువదలని విక్రమార్కుడిలా హరితహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపగా, నాడు నాటిన కోట్లాది మొక్కలు నేడు వట వృక్షాలుగా ఎదిగాయి. ఫలితంగా కరీంనగర్ జిల్లా పచ్చదనానికి చిరునామాగా మారింది. ఎనిమిది శాతమున్న అటవీ సంపద 12 శాతానికి పెరిగినట్లు అధికారుల గణాంకాలు వెల్లడించాయి.

వెదిర గ్రామంలోని ప్రధాన రోడ్డు పక్కన అగ్నికి ఆహుతైన మొక్కలు

ఏడాదిలోనే తలకిందులు

ఒక్క ఏడాదిలోనే పరిస్థితులు తలకిందులయ్యాయి. హరితహారంలో భాగంగా నాటిన మొక్కల సంరక్షణ కరువైంది. వాటికి నీరు పోయాలని పురమాయించేందుకు పాలక వర్గాలు లేవు. అధికారుల పట్టింపు అంతకన్నా లేదు. చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేదు. దీంతో, పంట పొలాల్లోకి నీడ వస్తున్నదంటూ రైతులు, విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్నాయంటూ విద్యుత్ శాఖ సిబ్బంది ఇష్టారీతిగా నరికివేస్తున్నారు. మరోవైపు నరికిన మండలు ఎక్కడికక్కడే వదిలేయగా, ధూమపాన ప్రియులు తాగి విసిరేసే బీడీ, సిగరేట్లతో అగ్గిరాజుకుని, బుగ్గిపాలవుతున్నాయి. వాటి అవశేషాల బూడిద రహదారులపై వెళ్లే ప్రయాణికుల కళ్లను కప్పుతుండగా, ప్రమాదాలకు హేతువులుగా మారుతున్నాయి. జిల్లాలోని శనిగరం నుంచి మొదలు దుబ్బపల్లి వరకు, కరీంనగర్ నుంచి గంగాధర, ఒద్యారం, చొప్పదండి వరకు రహదారులకిరువైపులా ఏపుగా పెరిగిన చెట్లతో సంతరించుకున్న పచ్చదనం కనుమరుగవుతున్నది. ఫలితంగా పర్యావరణం దెబ్బతింటుందని పర్యావరణవేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండుటెండల్లో ప్రయాణం చేసే తమకు చెట్ల నీడ కరువవుతున్నదంటూ బాటసారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు అవెన్యూ ప్లాంటేషన్ల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరమున్నదనే అభిప్రాయాలు వారి నుంచి వ్యక్తమవుతున్నాయి.

నేటి ప్రజావాణి రద్దు

కలెక్టరేట్, ఏప్రిల్ 20 : నేడు జరుగాల్సిన ప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. కొత్త ఆర్వోఆర్ రెవెన్యూ చట్టం అమలు నేపథ్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న అవగాహన సదస్సుల్లో అధికారులు పాల్గొంటున్న దృష్ట్యా ప్రజావాణి రద్దు చేశామని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు.

22న ఇంటర్వ్యూలు

వీణవంక, ఏప్రిల్ 20: 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ దివ్యాంగుల లోన్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 22న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీధర్ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, ఏప్రిల్ 20: నగరంలోని 11కేవీ గోదాం గడ్డ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్నందున సోమవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ ఎం లావణ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు శ్రీనగర్ కాలనీ, భవానీ కాలనీ, సప్తగిరి కాలనీ, తహేర మసీద్ ఏరియా, అంజనాద్రి గుడి, ధోబీ ఘాట్, గోదాం ఏరియా, బీఎస్ఎఫ్ క్వార్టర్స్, ఏవోస్ పార్కు ప్రాంతాలకు సరఫరా ఉండదని తెలిపారు.

భూ విక్రయం పేరిట మోసం

- న్యాయం చేయాలంటూ రియల్టర్ ఇంటి ఎదుట బైఠాయింపు
- పోలీసుల హామీ మేరకు ఆందోళన విరమణ

కరీంనగర్‌లోని అలకాపురికాలనీలో రియల్టర్ కాళ్ల రమేశ్ ఇంటి ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి బైఠాయించిన చొప్పరి శ్రీనివాస్, బైరి చిరంజీవి

కరీంనగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 20: వ్యవసాయ భూమి విక్రయిస్తామంటూ చెప్పి రూ.70 లక్షలు వసూలు చేసి మోసం చేశాడని ఆరోపిస్తూ ఇద్దరు వారి కుటుంబ సభ్యులతో కలిసి కరీంనగర్‌లోని ఓ రియల్టర్ ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల కేంద్రానికి చెందిన చొప్పరి శ్రీనివాస్, అక్కనపేట మండలం గౌరవెల్లి గ్రామానికి చెందిన బైరి చిరంజీవి మాట్లాడుతూ, అక్కన్నపేట మండలం జనగామ గ్రామ శివారులోని పలు సర్వేనంబర్లలో గల 9.16 ఎకరాల భూమిని కాళ్ల రమేశ్ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి వద్ద తొమ్మిదేళ్ల క్రితం కొనుగోలు చేశామని, ఇందుకోసం రూ.70 లక్షల మొత్తం విడుతల వారీగా నగదు రూపేణా చెల్లించినట్లు తెలిపారు. అయితే, రిజిస్ట్రేషన్ చేయకుండా కాలయాపన చేయగా నిలదీయడంతో ఆ భూమి కోర్టు వివాదంలో ఉన్నట్లు చెప్పాడని పేర్కొన్నారు. దీంతో, నెలన్నర క్రితం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా రూ.60 లక్షలు చెల్లిస్తానంటూ చెక్కు ఇచ్చాడని, అది కూడా బౌన్స్ కావడంతో, ఇదేమిటని అడిగితే డబ్బులు ఇచ్చేది లేదని తెగేసి చెప్పాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినా తనకున్న రాజకీయ పలుకుబడితో అరెస్టు కాకుండా, పోలీసుల ఒత్తిడి నుంచి తప్పించుకుంటున్నాడని చెప్పారు. విధిలేని పరిస్థితుల్లో తమ కుటుంబాలతో వచ్చి నగరంలోని అలకాపురి కాలనీలో గల రియల్టర్ ఇంటి ఎదుట నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోళనకారుల వద్దకు వచ్చి వివరాలు ఆరా తీశారు. పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని చెప్పగా, డబ్బులిచ్చే వరకు కదిలేదంటూ వారు తెగేసి చెప్పారు. ఎస్ఐ రాజన్న వారిని సముదాయించడంతో ఆందోళన విరమించి ఆయన వెంట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. కాగా, ఆరోపణలు ఎదుర్కొంటున్న రియల్టర్ కాళ్ల రమేశ్ భార్య లాస్య రెవెన్యూ శాఖలో ఆర్ఐగా హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల్లో గతంలో పనిచేయగా, ప్రస్తుతం జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తున్నది. ఆమె ప్రోద్బలంతోనే తాము భూమి కొనుగోలు కోసం తన భర్త రమేశ్‌కు డబ్బులిచ్చామంటూ సదరు వ్యక్తులిద్దరు ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా రమేశ్‌ను ఫోన్‌లో సంప్రదించగా, తనపై కావాలనే బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. తనకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, భూ యజమానికే నేరుగా డబ్బులు చెల్లించారని, సకాలంలో మిగతా డబ్బులు చెల్లించకపోవడంతో రిజిస్ట్రేషన్ చేయలేదన్నారు. భూయజమానుల పక్షాన తాను డబ్బులు ఇచ్చేందుకు అంగీకరించి, రూ.52లక్షల 50 వేలకు మాత్రమే బాండ్ పేపర్ రాసిచ్చినట్లు వెల్లడించారు. రూ.60 లక్షల మొత్తానికి బలవంతంగా చెక్కుపై సంతకం చేయించుకున్నారని, తనకు ఎవరి రాజకీయ అండదండలూ లేవని స్పష్టం చేశారు.

అర్హులందరికీ నాలుగు గ్యారెంటీలు ఇవ్వాలి

గంగాధర, ఏప్రిల్ 20: మండలంలోని 33 గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ప్రకటించిన నాలుగు గ్యారెంటీలను అందజేయాలని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. నాలుగు గ్యారెంటీలను పైలట్ ప్రాజెక్టు పేరుతో ప్రభుత్వం మండలంలో ఒక్క గ్రామానికి పరిమితం చేసిందని విమర్శించారు. నాలుగు గ్యారెంటీల కోసం మండలంలోని కురిక్యాల గ్రామాన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేసి దాదాపు రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు వందశాతం పూర్తికాలేదని తెలిపారు. ఇప్పటి వరకు కొత్త రేషన్ కార్డులు వందశాతం ఇవ్వలేదని, ఇందిరమ్మ ఇండ్లు కొందరికే వచ్చాయని, రైతు భరోసా, ఆత్మీయ భరోసా అందరికీ రాలేదని పేర్కొన్నారు. నాలుగు గ్యారెంటీల కోసం మండలంలోని ప్రజలు 16 నెలలుగా ఎదురు చూస్తున్నారని, వాటిని అన్ని గ్రామాల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

హుజూరాబాద్ రూరల్: రంగాపూర్ గ్రామంలోని కల్వరి టెంపుల్‌లో ప్రార్థనలు నిర్వహిస్తున్న మహిళలు

జమ్మికుంట/ వీణవంక/హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 20: ఈస్టర్ వేడుకలను వివిధ చర్చిల్లో ఘనంగా జరుపుకొన్నారు. జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని మారుతీనగర్ గెస్సమనే ప్రార్థనా మందిరంలో పాస్టర్ జోజి.. లోకపాపముల కోసం ఏసుక్రీస్తు చేసిన ప్రాణత్యాగం, పునరుత్థానం గురించి వివరించారు. అందరూ కలిసి పాటలు పాడుతూ, చిన్నారులు నృత్యాలు చేస్తూ సంతోషంగా గడిపారు. వీణవంక మండల కేంద్రంలోని సీఎస్ఐ, హెబ్రోన్ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ ఏసురత్నం చిన్నారులతో కలిసి కేక్‌కట్ చేశారు. హుజూరాబాద్ మండలం రంగాపూర్ గ్రామంలోని కల్వరీ టెంపుల్‌లో ఫాదర్ నెల్సన్ ఈస్టర్ ప్రాముఖ్యతను వివరించారు. పేద మహిళలకు చీరలు వితరణ చేశారు.

ట్రాక్టర్ నుంచి కూలిన ధాన్యం బస్తాలు

వంకాయగూడెం వద్ద ట్రాక్టర్‌లోంచి కూలిన ధాన్యం బస్తాలు

శంకరపట్నం, ఏప్రిల్ 20: మండలంలోని వంకాయగూడెం వద్ద ధాన్యం లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌లో నుంచి ధాన్యం బస్తాలు కూలాయి. హుజూరాబాద్ మండలం కందుగుల నుంచి మానకొండూర్‌లోని సీడ్ ప్లాంట్‌కు వెళ్తున్న ట్రాక్టర్ టైర్ పంచర్ కావడంతో డ్రైవర్ ట్రాక్టర్‌ను కేశవపట్నం పంచర్ కొట్టు వైపు తిప్పాడు. అప్పటికే పూర్తిగా టైర్‌లో గాలి పోవడంతో ఓ పక్కకు ట్రాక్టర్ నిలుపగా, ఒక పక్కకు ఒరగడంతో ట్రాక్టర్‌లోంచి ధాన్యం బస్తాలు కూలిపోయాయి. ఈ క్రమంలో బస్తాలు చిరగడంతో కొంత ధాన్యం నేల పాలైంది. తర్వాత గంట పాటు శ్రమ పడి డ్రైవర్ తిరిగి ట్రాక్టర్‌లో లోడ్ చేసి ప్లాంట్‌కు తరలించారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్ నీట్

ప్రశ్నాపత్రాన్ని విడుదల చేస్తున్న రమేశ్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 20 : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మోడల్ నీట్ పరీక్ష ఆదివారం ప్రారంభమైంది. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలోని క్రిస్టియన్ కాలనీ శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ప్రశ్నాపత్రాన్ని చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్ రెడ్డి, కళాశాలల డీన్ జగన్ మోహన్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముద్దసాని రమేశ్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు ఉపయోగపడేలా ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం మోడల్ నీట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, జిల్లా సహాయ కార్యదర్శి గట్టు ఆకాశ్, జిల్లా కమిటీ సభ్యులు సందేశ్, అక్షయ్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ చెక్ అందజేత

వీణవంకలో నామినీకి చెక్ అందజేస్తున్న ఎస్‌బీఐ అధికారులు

వీణవంక, ఏప్రిల్ 20: మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గోస్కుల కుమార్ కుటుంబ సభ్యులకు ఎస్‌బీఐ అధికారులు జీవిత బీమా చెక్కు అందజేశారు. గోస్కుల కుమార్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందాడు. వీణవంక ఎస్‌బీఐ బ్యాంక్‌లో రూ.వెయ్యి ఇన్సూరెన్స్ చేసుకున్నాడు. కుమార్ ప్రమాదవశాత్తు మృతిచెందగా, నామినీగా ఉన్న అతడి భార్య స్వప్నకు రూ.20 లక్షల విలువ గల చెక్కును ఆదివారం ఎస్బీఐ బ్యాంక్ సీఎం డిపార్ట్‌మెంట్ వాస్‌ప్రసాద్ కాసరి, బ్రాంచ్ మేనేజర్ గట్ల శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ సిబ్బంది రాహుల్, అవినాష్, వేణు, శ్రీకాంత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్ మృతి

సంధ్య (ఫైల్)

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 20: పట్టణంలోని కుమ్మరి వాడ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్న గన్నారపు సంధ్య(34) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సంధ్య మృతికి హుజూరాబాద్ సీడీపీవో సుగుణ, సూపర్‌వైజర్లు పద్మ, రాజశ్రీ, శిరీష, రమాదేవి, స్వరూప సంతాపం వ్యక్తం చేశారు.

బీజేపీ మతతత్వ పార్టీ

- దేశ ప్రజల మధ్య కుల, మత విద్వేషాలను సృష్టిస్తున్నది
- విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

తెలంగాణచౌక్, ఏప్రిల్ 20: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మతతత్వ పార్టీ అని, కుల మతాలకతీతంగా శాంతియుతంగా జీవనాన్ని కొనసాగిస్తున్న దేశ ప్రజల మధ్య విద్వేషాలను సృష్టిస్తున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బద్దం ఎల్లారెడ్డి భవనంలో పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామితో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే గొంతుకలను అణవేయాలని ఆ పార్టీ పెద్దలు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ముస్లింలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాయాలని చూస్తున్నారని ఆరోపించారు. ముస్లింల వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకోవడం ఎందుకని ప్రశ్నించారు. దేశంలోని మావోయిస్టులను మార్చి 2026లోగా నిర్మూలిస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరుపాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరుగ్యారెంటీలను అమలు చేయాలని, మంచి పాలన అందించాలని సూచించారు. పథకాలు అమలు చేసే అవకాశం లేకపోతే రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల గురించి ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల మీద తమ పార్టీ పోరాటాలను కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీకి స్థానం లేదన్నారు. కేంద్రంలోనూ బలం లేక టీడీపీ, జేడీయూ మద్దతుతో అధికారంలోకి వచ్చిన విషయాన్ని మర్చిపోవద్దని హితవుపలికారు. ఈ సమావేశంలో నగరం కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, కొయ్యడ సృజన్‌కుమార్, టేకుమల్ల సమ్మయ్య, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో వాణిజ్య పన్నుల శాఖ విశ్రాంత ఉద్యోగులతో అధికారులు, నాయకులు

విద్యానగర్, ఏప్రిల్ 20: నగరంలోని ఓ హోటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం 18 జిల్లాల వాణిజ్య పన్నుల శాఖ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గత ఫిఫ్త్ జోన్‌లో పనిచేసి చనిపోయిన ఉద్యోగులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం మాజీ డిప్యూటీ కమిషనర్ జకరయ్య, మాజీ సీటీవో రామస్వామి తదితరులు మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని కరీంనగర్‌లో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ అందరినీ సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీసీటీఎన్‌జీవో సంఘం రాష్ట్ర నాయకుడు జగన్మోహన్ రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్షుడు జి. భిక్షపతి, తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులతో పాటు గెజిటెడ్ అధికారుల సంఘం మాజీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, మహమ్మద్ సర్దార్, మొగిలి ప్రభుదాస్, 100కు పైగా ఉద్యోగులు పాల్గొన్నారు.

హాకీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులకు సన్మానం

హాకీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులను సన్మానించిన హాకీ క్రీడాకారులు

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 20: హుజూరాబాద్ హాకీ క్లబ్ నూతన అధ్యక్షుడు తోట రాజేంద్రప్రసాద్, కార్యదర్శి బొడిగె తిరుపతిని ఆదివారం హుజూరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో హాకీ క్రీడాకారులు ఘనంగా సన్మానించారు. అలాగే, హాకీ క్లబ్ జిల్లా ఉపాధ్యక్షుడు బండ శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, మాజీ సెక్రటరీ ఉమామహేశ్వర్, లారీ అసోసియేషన్ గౌరవ సలహాదారుగా ఎన్నికైన ఎండీ సజ్జును క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హుజూరాబాద్ హాకీకి పెట్టింది పేరు అని, రాబోయే తరాలకు కూడా హాకీని పరిచయం చేసి వారిని అభివృద్ధిలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హాకీ క్లబ్ ఉపాధ్యక్షులు భూసారపు శంకర్, వేముల రవికుమార్, ఆరెల్లి రమేశ్, ఎండీ యూసుఫ్, సహాయ కార్యదర్శి సాదుల శ్యాం, సీహెచ్ రాజు, రాజేశ్, కే రాజేశ్, ఎస్ విక్రమ్, ఎం విక్రమ్, సాంబరాజు, పరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.